దసపల్లా భూముల్లో రోడ్లు నిర్మాణంపై రగడ

కార్పొరేటరర్లు మధ్య తోపులాట

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రతిపక్ష కార్పొరేటర్ల ఆందోళన మధ్యే జీవీఎంసీ కౌన్సిల్ సోమవారం సాగింది. సభ్యుల డిమాండ్ మేరకు జీరో అవర్‌తో మొదలైన సమావేశం మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సమక్షంలో సాగిన కౌన్సిల్ వాదోవాదాల నడుమ కొనసాగింది. దసపల్లా భూముల వివాదం పూర్తికాకుండానే 100 అడుగులు రోడ్ల విస్తరణకు రూ. 4.62 కోట్లు వ్యయంతో నిర్మించడం అవసరమా అని జనసేన, సిపిఐ, సిపిఎం, టిడిపి సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. మేయర్ పోడియం వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ దశలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య కుమ్ములాట చేసుకుంది. తోపులాటల మధ్య టిడిపి కార్పొరేటర్ గంధం శీను కింద పడిపోయారు. సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, సిపిఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు ఈ రోడ్డు నిర్మాణ పనులకు అభ్యంతరం తెలిపారు. ఆయా వార్డుల పరిధిలో చేపట్టే మరమ్మతులు, అభివృద్ధి పనుల విషయమై కార్పొరేటర్లను భాగస్వామ్యం చేయాలని, అవసరమైతే సభ్యుల సంతకాలు కూడా సేకరించాలని అన్నారు.

విద్యుత్ లైట్ల పని తీరును ఎద్దేవా చేశారు. 79వ వార్డులో వీధి దీపాలు వెలగడం లేదని కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ధ్వజ మెత్తారు. 35వ వార్డు కార్పొరేటర్ విళ్లూరి భాస్కరరావు మాట్లాడుతూ తన వార్డు పరిధిలో పూర్ణ మార్కెట్‌లో రెచ్చిపోతున్న కాంట్రాక్టర్ పైనా చర్యలు తీసుకోవాలన్నారు.

జీవీఎంసీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎన్ ఫోర్స్‌మెంట్ బృందాలు పెద్ద బోగస్ అని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. భవన నిర్మాణాల వద్దకు వెళ్ళి కమిషనర్ పేరు చెప్పి ఉద్యోగులు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జీవీఎంసీ కౌన్సిల్‌లో జనసేన పార్టీ నేతల అరెస్టుపై దుమారం రేగింది. జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంత లక్ష్మి, కార్పొరేటర్ దల్లి గోవింద రెడ్డి ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ ప్రజా సమస్యలపై చర్చించేందుకు తమ పార్టీ నేతలు, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తదితరుల్ని అరెస్ట్ చేయించడం దారుణం అంటూ ఆరోపించారు. వెంటనే అధికార పార్టీ నేతలు ఈ విషయాన్ని అడ్డుకుంటూ కౌన్సిల్ లో ప్లాస్టిక్ బేనర్ ఏంటంటూ దూషించారు. దీంతో రచ్చ జరిగింది.

అక్రమాలకు తావు లేకుండా పంట నష్ట పరిహారం ఇవ్వాలి

సీపీఐ రౌండ్ టేబుల్‌లో వక్తలు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: నష్టపోయిన పంటలను గుర్తించి అక్రమాలు జరుగకుండా ఎన్యూమరేషన్ చేయాలని. కౌలు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. మిచౌంగ్ తుఫాను, కరువు నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గల పార్టీ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడారు. ప్రతి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధితోపాటు రైతు సంఘాల బాధ్యులను ఎన్యూమరేషన్ కమిటీలో అవకాశం కల్పించాలని, రాష్ట్రంలోని తక్కువ వర్షపాతం నమోదైన 470 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు రూ.40 వేలు, వాణిజ్య పంటలకు రూ.75 వేలు, ఉద్యాన పంటలకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని, 2012లో భూపేంద్ర హుడా కమిటీ సిఫార్సుల ప్రకారం, ప్రస్తుతం పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా నష్టపరిహారం నిర్ణయించాలన్నారు. అన్ని పంటలకు పంటల బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈనెల14న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు అన్ని పార్టీలు తరలిరావాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కర్రీ అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెలుగుల అర్జున్‌రావులు మాట్లాడుతూ రెండవ పంట వేసుకునేందుకు అవసరమైన రుణాలు వరి, మినుము తదితర విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని అన్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని, పత్తి, మిర్చి పంటలను ఎటువంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ కే.కోటపాడు మండల కార్యదర్శి జి.దేవుడి బాబు, మునగపాక మండల కార్యదర్శి మల్ల మాధవరావు, అనకాపల్లి మండల కార్యదర్శి చెల్లూరి నాగరాజు, టీడీపీ నాయకులు సాలపు నాయుడు, జనసేన నాయకులు సూర్య జగన్నాథరావు, సీపీఎం నాయకులు తైలయ్య బాబు, నాయకులు నాయన బాబు, ఏఐవైఎఫ్ నాయకులు వియ్యపురాజు, కౌలు రైతు సంఘం నాయకులు నరాల శెట్టి సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు పప్పల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుఫానులో ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర - చోడవరం: మిచౌంగ్ తుఫాను కారణంగా చోడవరం మేజర్ పంచాయతీలో రెల్లి వీధి రైతు బజారు ప్రాంతంలో ఇళ్లు పూర్తిగా పడిపోయిన వారికి వెంటనే ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ తిరుమలబాబుకు వినతి పత్రం అందజేశారు. తుఫాను నష్టాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళగా తూతూ మంత్రంగా దర్యాప్తు జరిపించి, నేటికి ప్రభుత్వం నుండి రావాల్సిన నష్టపరిహారం 10,000 రూపాయలు చెల్లించలేదన్నారు. దీనిపై మండల రెవెన్యూ అధికారి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు పసుపులేటి రమణమ్మ, బండి లక్ష్మి, పొట్నూరు దుర్గ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగులకు తప్పని అవస్థలు

విశాలాంధ్ర - జి.మాడుగుల: జిల్లా వైద్య ఆరోగ్య కళాశాల, ఆసుపత్రి ఉద్యోగుల భర్తీలో సమర్పణ గడువు పొడిగింపు ఉన్న కూడా బ్యాంక్ సేవల్లో, డీడీలు పొందే క్రమంలో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. బ్యాంక్ నిర్వాహకులు సమయపాలన లోపం వల్ల సేవలు పొందలేక పోతున్నామని నిరుద్యోగులు వాపోతున్నారు. వినియోగదారులు పట్ల దురుసుగా ప్రవర్తించడం, చులకనగా మాట్లాడే ధోరణి తగదన్నారు. బ్యాంకు అధికారుల విధి నిర్వహణపై దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల జిల్లా అధ్యక్షులు బూడిదే చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి రమేష్, మండల కార్యవర్గ సభ్యులు భానుప్రసాద్, పంతులు రాజు, భాను చందర్, లక్ష్మయ్య, బాలరాజు పాల్గొన్నారు.

కరాటేలో భవానీ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - అచ్యుతాపురం: విశాఖలో జరిగిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో భవాని విద్యా నికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ డి.శ్రీనివాస రావు తెలిపారు. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎండి శ్రీలత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ సాధించిన పతకాలను, సర్టిఫికెట్లను అందజేశారు. కరస్పాండెంట్ సంతోష్ అభినందిస్తూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఈశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతం ఎక్సలెన్స్‌మీట్ -24కు ఆహ్వానం

విశాలాంధ్ర - మధురవాడ: వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ రెండు రోజుల పాటు నిర్వహించే గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్) 2024 ను జనవరి 10, 11 తేదీలలో నిర్వహిస్తున్నట్లు బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. సోమవారం జెమ్-2024 ఆహ్వాన కమిటీతో కలిసి ఆయన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెమ్ కన్వీనర్, సీనియర్ ప్రొఫెసర్ కె.అశోక్ వివరాలను తెలియశారు. కర్తవ్య పేరిట నిర్వహిస్తున్న జెమ్-24 ఉత్సవంలో వాణిజ్య అంశాలపై వర్క్‌షాప్‌లు, సమకాలీన కార్పోరేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్ళపై చర్చలు, విద్యార్థులు ఫ్యాషన్‌షో, రాక్‌బాండ్, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో జెమ్-24 నిర్వాహక బృంద సభ్యులు, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్!

పార్టీకి దేవన్ రెడ్డి రాజీనామా

విశాలాంధ్ర - గాజువాక: వైసీపీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు, ఆ పార్టీ గాజువాక ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి సోమవారం పార్టీకి రాజీనామా చేశారు. అనూహ్య ఈ నిర్ణయం జిల్లా పార్టీ శ్రేణుల్లో కలకలం సృష్టించింది. మరికొద్ది నెలల్లో ఉన్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో పార్టీలో ఈ తరహా జలకులు ఆయా పార్టీలకు కాస్తంత ఇబ్బంది కలిగించే పరిణామాలుగానే పేర్కొనాలి. వచ్చే ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం యాదవులకు కేటాయించాలని వైసిపి అధిష్ఠానం నిర్ణయించింది. మరోవైపు తిప్పల నాగిరెడ్డి 2019 ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను ఎదుర్కొని ఎమ్మెల్యేగా గెలిచారు. అంతేకాకుండా రాజకీయ నేపథ్యం ఉన్న సీనియర్ నేతగా నాగిరెడ్డి మంత్రివర్గ విస్తరణలో చోటు దొరుకుతుందని ఆశించి భంగపడ్డారు. ఇప్పుడు ఏకంగా పార్టీ టికెట్ కూడా చేజారే పరిస్థితి దాపురించడంతో నాగిరెడ్డి శిబిరంలో అసంతృప్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే ఈసారి గాజువాక టికెట్ యాదవ సామాజిక వర్గానికి చెందిన యువనేత ఉరుకూటి చెందూకు దక్కబోతున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే దేవన్ రెడ్డికి భవిష్యత్తులో ఎమ్మెల్సీ పదవి ఉందని పార్టీ బొజ్జగించే ప్రయత్నాలను సైతం అక్కరకు రావడం లేదు. తొందరపాటు వద్దని కొందరు, వేచి చూడాలని మరికొందరు దేవన్ రెడ్డికి హితవు పలుకుతున్నారు. దేవన్ రెడ్డి ఎమ్మెల్యే నాగిరెడ్డి కుమారుడే కాకుండా, అంతా తానై సేవల్లో ఉండడం మూలాన అధిష్టాన నిర్ణయాన్ని ఆ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఏదేమైనా ఈ పరిణామం ఎటు గాజువాకనే కాకుండా విశాఖ పార్టీ శ్రేణుల్లోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

దీపోత్సవానికి పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభంలోని మంగళ వారం నిర్వహించనున్న అనంతపద్మనాభ స్వామి గిరిమెట్ల దీపోత్సవానికి 500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పద్మనాభం సిఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీస్ సిబ్బందితో రక్షణ కల్పిస్తామన్నారు. ఉత్సవంలో రద్దీగా ఉండే గిరి తొలి పావంచ వద్ద, అలాగే గిరి పైన ఉన్న దేవాలయం వద్ద అధిక సంఖ్యలో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విజయనగరం నుండి వచ్చే వాహనాలను స్థానిక ఎంఆర్ కాలేజ్ వద్ద పార్కింగ్ స్థలాన్ని కేటాయించినట్టు తెలిపారు. సింహాచలం నుండి వచ్చే వాహనాలకు మద్ది పెట్రోల్ బంకు వద్ద, తగరపువలస నుంచి వచ్చే వాహనాలకు స్ప్రింగ్ ఫీల్డ్ స్కూల్ వద్ద పార్కింగ్ స్థలాలను కేటాయించామన్నారు.

కుదుపుసింగి బస్ షెల్టర్‌కు గ్రహణం

విశాలాంధ్ర - చింతపల్లి: మండలంలోని ఎర్రబొమ్మల పంచాయతీలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి కూడలిలోని కుదుపు సింగి గ్రామ సమీప బస్ షెల్టర్ కు గ్రహణం పట్టింది. పంచాయతీలోని ఇటు ఎర్ర బొమ్మల, సాడిక మరోవైపు కొండవంచుల, ఎర్రబంధ, రోలంగి గ్రామాల ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థంగా గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన కుదుపు సింగి బస్సు షెల్టర్ నిర్మాణ పనులను గుత్తేదారుడు పూర్తి చేయ కుండా అర్ధాంతరంగా నిలిపివేయడంతో శిథిలావస్థకు చేరి నేటికీ నిరుపయోగంగా దర్శనమిస్తుంది. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా దర్శనమిస్తున్న విశ్రాంతి భవనాన్ని పూర్తిగా నిర్మాణం చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంతల నాగేశ్వరరావు కోరారు. ఎమ్మార్వో, ఎంపీడీఓ కార్యాలయాలను ఆయన మండల కమిటీ సభ్యులతో సందర్శించారు. మండల ప్రజలు అడిగిన సమాచారం మేరకు అందించాలని తెలిపారు. అనంతరం సుజనకోట గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో ఫోనులో ఎంపీడీకు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి ఎంపీడీవో సమావేశ మందిరంలో మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు శిక్షణ తరగతులలో సచివాలయ సిబ్బంది హాజరయ్యారని తెలిపారు. మానవ సమాచార హక్కు చట్టం 2005ను ప్రతి సచివాలయ కార్యాలయాల ఆవరణలో బోర్డులను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కిరణ్ కుమార్‌కు ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్టిఐ యాక్ట్ మండల కార్యవర్గ సభ్యులు కె.మోహన్, జి.కోటేశ్వరరావు, పి.చిరంజీవి, టి.భగీరథిలు పాల్గొన్నారు.

అన్న సమారాధనలో ఎం.వి.ఆర్

విశాలాంధ్ర - మునగపాక: అన్ని మాసాలలోకి కార్తీక మాసంనకు ఒక ప్రత్యేకత ఉంటుందని ప్రముఖ వ్యాపార వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలో గవర్ల అనకాపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో చేపట్టిన కార్తీక మాసపు పూజ వ్రత కార్యక్రమానికి ఎంవిఆర్ తన తనయుడు సతీష్ బాబుతో కలిసి పాల్గొన్నారు. ఎంవిఆర్ చేతుల మీదుగా స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎం.వి.ఆర్ చేతుల మీదుగా ప్రారం భిం చారు. ఈ కార్యక్రమంలో ఎంవీఆర్ యువసేన సభ్యులు, ఎంవి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సంజు బాబు, స్థానికులు, చుట్టుపక్కల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వ్యర్థాల పైపులైను ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామసభ తీర్మానం

విశాలాంధ్ర - పాయకరావుపేట: కాకినాడ జిల్లాలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు చెందిన వ్యర్థాల పైపులైను ఈ ప్రాంతంలో సముద్రంలో వదిలేందుకు ఏర్పాటు చేస్తున్న పైపులైను పనులను మండలంలోని కుమారపురంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆ గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల మత్స్యకార గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు కూడా వ్యతిరేకించారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పైపులైను వేసేందుకు కుమారపురం పంచాయతీ అనుమతి కోరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పనులు వేసేందుకు పరిశ్రమ వ్యర్థాలను పైపులైన్ ద్వారా ఈ ప్రాంతంలో సముద్రంలో వదలటం వలన మత్స్య సంపద నాశనం అవుతుందని తెలిపారు. ఇప్పటికే సముద్రతీరం వెంట ఏర్పాటు చేసిన పరిశ్రమల కారణంగా మత్స్య సంపద నాశనమై మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. పైప్ లైన్ వేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పైపులైను వేయవద్దంటూ గ్రామ సభలో తీర్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచులు పిరమళ్ళ గోవిందమ్మ, వంకా వెంకట రమణ, కోడా కోటేశ్వరరావు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాసరావు, నీలాపు బాలకృష్ణారెడ్డి, రావాడ గోవింద్ రెడ్డి, పిరమళ్ళ సత్యనారాయణ, బొంది కాశీ విశ్వనాథ్, గోసల రమణ, మైలపల్లి అశోక్ చక్రవర్తి, పిరమళ్ళ రామకృష్ణ, చేపల దేవుడు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఉపాధ్యాయుడిగా మారిన ఐటీడీఏ పీఓ

హెచ్ఎం వెంకట ప్రసాద్‌కు షోకాజ్ నోటీసు

విశాలాంధ్ర - అరకులోయ: పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ బస్కిలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో కాసేపు సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా మారి పోయారు. పదవ తరగతి విద్యార్థులకు భౌగోళిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించి ఖాళీగా ఎందుకున్నాయని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పది విద్యార్థులు పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించేలా బోధించాలని ఆయన సూచించారు. పాఠశాలలో 18 మంది విద్యార్థులు డ్రాపౌట్స్ ఉన్నారని గుర్తించి ప్రధానోపాధ్యాయుడు డి.వెంకట ప్రసాద్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని గిరిజన సంక్షేమ ఉప సంచాలకులను ఆదేశించారు. డ్రాపౌట్స్ నివారించడానికి ఎంపీడీఓ, ఏటీడబ్ల్యూఓలతో సమావేశం నిర్వహించాలని డీడీకి సూచించారు. 9వ తరగతి విద్యార్థి కిండంగి బలరామ్ కంటికి చూపు సరిగా లేదని గుర్తించి ఆ విద్యార్థికి సదరం సర్టిఫికేట్ జారీ చేయాలని జిల్లా వైద్యాధికారి డా. జమాల్ భాషాను ఫోనులో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, తహశీల్దార్ వేణు గోపాల్ పాల్గొన్నారు.

ప్రధాని వికసిత్ భారత్ ప్రసంగంలో ఏయూ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: దేశ ప్రధాని నోట ఏయూ మాట వినిపించింది. ఈ మేరకు సోమవారం వికసిత్ భారత్ ఏ 2047 - వాయిస్ ఆఫ్ యూత్ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా ప్రధాని వర్చువల్ విధాన ప్రసంగంలో ఆంధ్ర విశ్వవిద్యా లయాన్ని ప్రస్తావించారు. దేశంలోని వివిధ విశ్వ విద్యాలయాలలో యువతను ఉద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా దేశ వ్యాప్తంగా విభిన్న విశ్వవిద్యాలయాల నుంచి ఎందరో స్వాత ంత్ర్య ఉద్యమ పోరాట యోధులు, ఉద్యమకారులు ఉద్భవించారన్నారు. వీటిలో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఒకటని ప్రధానమంత్రి తన ప్రసంగంలో ప్రస్తావిం చారు. ఇటీవల ఏయూ నాక్ ఏ డబల్ ప్లస్‌తో పాటు 3.74 గ్రేడ్ పాయింట్లు సాధించి జాతీయ విద్యా సంస్థలను సైతం అధిగమించింది. దీనితో ఏయూ ఖ్యాతి జాతీయ స్థాయిలో మార్మోగుతోందని, ఇటీవల కాలంలో ఏయూ సాధించిన అభివృద్ధి నాక్ స్కోర్ వంటివి కేంద్ర విద్యశాఖ, ప్రధానమంత్రి దృష్టికి వెళ్లి ఆయన తన ప్రసంగంలో ఏయూను ప్రస్తావించారని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం అభివృద్ధి, వికా సాన్ని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. సోమవారం విజయవాడలో రాజ్ భవన్‌లో విశ్వ విద్యాలయాల అధికారులతో కలిసి వికసిత భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు పాల్గొన్నారు.

వారం రోజుల్లో జలపాతం సుందరీకరణ పూర్తి

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: చాపరాయి జలపాతం సుందరీకరణ పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ ఆదేశించారు. సోమవారం చాపరాయి జలపాతాన్ని సందర్శించి 40 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలపాతం ముందు ప్రహరీ, పర్యాటకులు కూర్చోవడానికి బెంచీలు, దుస్తులు, మార్చుకోవడానికి గదులు, చిన్న పిల్లల ఆట స్థలం నిర్మిస్తున్నామని చెప్పారు. వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలోనే పర్యాటకుల వాహనాలు పార్కింగ్ చేయాలని సూచించారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసి పర్యాటకులకు వసతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, ఏఈ అభిషేక్, మూజియం క్యూరేటర్ మురళీ కృష్ణ, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్‌లో ఎలక్ట్రిక్ ఆటోలను రద్దు చేయాలి

విశాలాంధ్ర - విశాఖ: బీచ్ రోడ్‌లో జీవీఎంసీ ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ ఆటోలను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు డిమాండ్ చేశారు. విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ పార్క్ లో వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కోస్టల్ బ్యాటరీ నుండి సాగర్ నగర్ వరకు గర్భిణీలు, వికలాంగులు, వృద్ధులకు ఉచిత ఎలక్ట్రిక్ ఆటోలను జీవీఎంసీ ఏర్పాటు చేసిందన్నారు. అయితే ఈ ఆటో డ్రైవర్లు ఇతర ప్రాంతాల నుండి బీచ్ సందర్శనకు వచ్చిన వారిని బేరం మాట్లాడుకుని ఆటోల్లో ఎక్కించుకొని తీసుకు వెళ్తున్నారని తెలిపారు. దీనివల్ల బీచ్ రోడ్డులో ఉన్న ఆటో డ్రైవర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. ఫిషింగ్ హార్బర్ నుండి రుషికొండ వరకు సుమారు 500 ఆటోలు తిరుగుతున్నాయని తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వి.సన్యాసిరావుకి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలిరెడ్డి వాసు, శేఖర్, బాలాజీ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్‌పై అవగాహన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో సోమవారం మాక్ పోలింగ్ ద్వారా నిర్వహించారు. 3, 4, 5 పోలింగ్ కేంద్రాలలో 300 మంది గ్రామస్తులకు ఓటు ఎలా వేయాలనే దానిపై అధికారులు అవగాహన కల్పించారు. మాడుగుల తహశీల్దార్ వివి.రత్నం ఆధ్వర్యంలో నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పిఎంజిఈపై రుణాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - అనంతగిరి: కిసాన్ క్రెడిట్ కార్డ్ రుణాలు. పిఎంజిఈపై రుణాలు మంజూరు చేయాలని కోరుతూ పెద్ద కోట, కీవర్ల, కుడియా, నక్కలమామిడి, పూతికపుట్టు, బొడ్డపుట్టు గ్రామాల రైతులు అనంతగిరి, కాశీపట్నం పశు వైద్యాధికారులు డా .సందీప్, డా .గణేశ్వరరావులను కలిసి వినతి అందించారు. స్పందించిన అధికారులు దీనికి సంబంధించి సంబంధిత బ్యాంక్ అధికారులకు నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారు.

17 నుంచి నెలగంట ప్రారంభం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో ఈ నెల 17వ తేదీ సాయంత్రం ధనుస్సంక్రమణం ప్రారంభం (నెల గంట) కానుంది. ధనుస్సంక్రమణం ప్రారంభం కావడం నెలరోజుల పండుగ సంబరం మొదలవుతోంది. తెలుగువారి ముంగిళ్లలో పెద్ద పండగ సందడి మొదలౌతుంది. హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల మేళాలు, ఆటల పోటీలు, కోడి పందాలు అందరినీ ఉత్తేజపరచనున్నాయి.

కుల గణన సర్వే సమగ్రంగా చేపట్టాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు: గ్రామాల్లో కుల గణన సర్వే అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సర్వేలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్లుదేనని అన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సమగ్ర కుల సర్వేపై అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ కులగణన సర్వేపై సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు నవంబర్ 27 నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీవో రామచంద్ర మూర్తి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమంపై పంచాయతీ కార్య దర్శులు, సచివాలయ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడలు జరిగే సమయంలో సిబ్బంది నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి అప్పారావు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీను, ప్రేమ్ కుమార్, కే.రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామాగ్రి వితరణ



విశాలాంధ్ర - పరవాడ: మండలంలోని భరణికం పంచాయతీ బావదుపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు రూ.4వేలు విలువ చేసే విద్యా సామగ్రిని వితరణ చేశారు. పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న 21 మంది విద్యార్థులకు సోమవారం నోట్ బుక్స్, ప్లాంక్స్, అట్టలు, డ్రాయింగ్ బుక్స్, కలర్ పెన్సిల్లు, ఎరైజర్లు, షార్పనేర్స్ వంటి సామగ్రిని హెచ్ఎం టి.రాజేశ్వరి, ఉపాధ్యాయుడు కొరుపోలు గంగాధర్ అందజేసారు. ఈ కార్యక్రమంలో తల్లితండ్రుల కమిటీ చైర్మెన్ ఎం.కళావతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నాలజీతో నూతన ఒరవడి

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో స్థానిక సొంత్యాంలో గల నడింపల్లి సత్యనారాయణ రాజు ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్ జరిగింది. ఎలక్ట్రికల్ సాంకేతికత, పర్యావరణ స్పృహతో కూడిన రవాణా యొక్క కొత్త శకానికి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎలక్ట్రికల్ విభాగాపతి డాక్టర్ ఆర్ఎస్ఆర్ కృష్ణంనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ జె.రాజా మురుగదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా మహాత్మ గాంధీ కళ్యాణ మండపం

విశాలాంధ్ర - భీమిలి: జీవీఎంసీ 3వ వార్డు సి.బి.ఎం హైస్కూల్ ఎదురుగా ఉన్న మహాత్మ గాంధీ కల్యాణ మండపం మందుబాబులకు అడ్డాగా మారింది. ఒకప్పుడు ఎంతోమంది వివాహాలకు వేడుకగా మారిన ఈ కళ్యాణ మండపం శిథిలావస్థలో ఉండటం వల్ల ఎటువంటి శుభకార్యములు జరుపుకోవటం లేదు. దీంతో మందుబాబులు ఇక్కడ మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి మందు బాబులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

రోడ్లు - భద్రత - ట్రాఫిక్‌పై అవగాహన

విశాలాంధ్ర - పెందుర్తి: పాఠశాలలో రోడ్లు- భద్రత ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెందుర్తి ట్రాఫిక్ ఎస్సై గుమ్మడి రమేష్ విచ్చేసి ట్రాఫిక్ నియమ నిబంధనలు, పాదచారులు పాటించవలసిన నియమాలను వివరించారు. విశాఖ నగరంలో ఇటీవల జరిగిన ప్రమాద దృశ్యాలను వీడియోల రూపంలో విద్యార్థినీ విద్యార్థులకు చూపించి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆంధ్రా జోన్ రవీంద్ర భారతి పాఠశాలల జోనల్ అధికారి ఎన్.వెంకటేష్, సిజీఎం జీఆర్. వసంత, జీఎం కే.రమ్య, ప్రిన్సిపాల్ కే.స్వరూప పాల్గొన్నారు.

బాబు షూరిటీ...భవిష్యత్తుకు "గ్యారెంటీ"

విశాలాంధ్ర - చింతపల్లి: రాష్ట్ర ప్రజలకు బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తుందని తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో బెన్నవరం పంచాయతీ పరిధిలోని గొచ్చపల్లి గ్రామంలో ఆదివారం బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గడచిన నాలుగున్నరేళ్లలో వైకాపా ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి బటన్ రెడ్డి గా మారి ప్రజలపై మోయలేని ఆర్థిక భారాన్ని మోపాడన్నారు. పరిపాలనను పక్కన పెట్టి, సంక్షేమం ముసుగులో అభివృద్ధిని విస్మరించారన్నారు. గతంలో రహదారి సౌకర్యం కల్పించాలని కోరుకునే ప్రజలు నేడు కనీసం గుంతలు పూడ్చండని మొరపెట్టుకునే పరిస్థితి కల్పించారన్నారు. ఈ సందర్భంగా ఆమె సమక్షంలో పలువురు తెదేపాలో చేరారు. ఈ కార్య క్రమంలో ఆ పార్టీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగ భూషణం, బండారు గంగరాజు పాల్గొన్నారు.

అనుకు గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - కోటవురట్ల: గొట్టివాడ శివారు అనుకు గిరిజన గ్రామానికి రోడ్డు మంజూరు చేసి ఆదుకోవాలని గిరిజనులు ఎంపీడీఓని కోరారు. సోమవారం ఇన్చార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. మిచౌంగ్ తుఫాన్ బీభత్సానికి మెటల్ రోడ్డు కూడా పూర్తిగా రాళ్లు తేరి గోతులమయంగా తయారై నడవలేని పరిస్థితిలో ఉందని, గిరిజనులకు ఏ అనారోగ్యం వచ్చినా అత్యవసర పరిస్థితుల్లో కోటవురట్ల ప్రధాన కేంద్రానికి రావడానికి నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. రోడ్డు నిర్మాణానికి, గ్రామంలో ఇతర అవసరాల నిమిత్తం గతంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టగా ప్రస్తుత కలెక్టర్ రవి పటాన్ శెట్టి గ్రామానికి రోడ్డు మంజూరు చేశారు అన్నారు. అయినప్పటికీ అధికారులు ఇప్పటివరకు రోడ్డు వేయడానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డేవిడ్ రాజు, మగ్రి సూరిబాబు, ఇతర గిరిజనులు పాల్గొన్నారు.

పోరాట ఫలితంగా తాగునీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: గిరిజన సంఘం పోరాట ఫలితంగా మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైందని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ చెప్పారు. ఆ గ్రామంలో మరమ్మతుకు గురైన తాగునీటి పథకం మోటర్‌ను సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధికారులు మరమ్మత్తు పనులు చేసి సోమవారం తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి పథకం మోటర్ మరమ్మతు చేయాలని గతంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణ వద్ద పలుమార్లు ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. దీంతో స్పందించిన అధికారులు గ్రామంలో తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సిహెచ్ రమేష్, మహదేవ్, టి.దను, పాపారావు, టి.కుమారి, టి.పూర్ణిమ, వంజన పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గం ప్రజల ఓటు హక్కు విలువపై అవగాహన కొరకు ఎలక్షన్ డిపార్ట్మెంట్ అధికారులతో కలిసి ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ, ఎమ్మార్వో శ్యాం ప్రసాద్, ఆర్ఐ సాయి కిరణ్ ఎలక్షన్ డిపార్ట్మెంట్ బృందం 200 మందికి పైగా ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఆదర్శ కళాశాల ప్రాంగణం వద్ద ప్రారంభమైన ర్యాలీ పెందుర్తి జంక్షన్ వరకు సాగింది. ఈ ర్యాలీలో ఆదర్శ కళాశాల విద్యార్థులతో పాటు కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మంజుల, గౌతమ్ బాబు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. కళాశాల సెక్రటరీ టి.థియో పిలస్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలియజేసారు.

చేతి పంపును బాగు చేయించరూ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండల కేంద్రం రేఖపల్లిలోని పాత ఎయిడెడ్ పాఠశాల వద్ద ఉన్న చేతి పంపు మరమ్మతులకు గురవడం వలన నీరు సక్రమంగా రాకపోవడంతో చుట్టుప్రక్కల ప్రజలు నీటికోసం ఇక్కట్లు పడుతున్నారు. చేతిపంపును కొట్టి కొట్టి కొట్టి అలసిపోవలసి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ శాఖ అధికారులు త్రాగునీటి చేతి పంపును రిపేరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సంతారిలో పల్లెకు పోదాం

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని సంతారి పంచాయితీ కేంద్రంలో నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమానికి స్థానిక ఎంపిపి కూడా రాజు బాబు, జెడ్పిటీసీ సభ్యుడు రేగం మత్యలింగంలు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో సచివాలయ కేంద్రాంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గెమ్మె లి కొండబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, జేసీయస్ మండల ఇంచార్జీ కే.రామకృష్ణా, స్థానిక సర్పంచ్ పాడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామ భక్తుల సైకిల్ యాత్రకు స్వాగతం

విశాలాంధ్ర - చింతూరు: మహారాష్ట్ర రాష్ట్రంలోని నాసిక్‌కు చెందిన ముగ్గురు రిటైర్డ్ ఉద్యోగులు అయోధ్య నుండి శ్రీలంక వరకు సైకిల్ యాత్ర చేయడానికి గత నెల 24వ తేదీన బయలుదేరారు. యాత్ర సాగిస్తూ ఆదివారం రాత్రికి చత్తీస్గఢ్ రాష్ట్రం కుంటకు చేరుకుంది. వీరిని మాణికేశ్వర్ ట్రస్ట్ సభ్యులు ఎ.శుభోదనరావు, పి.గోపాల్ నాయుడు (గురూజీ), విజయ్, ఎస్.రాంబాబు, అమితేష్ గోలు, మణికంఠ స్వామి స్వాగతం పలికి శివాలయంలో బస చేయించారు. వీరియాత్ర సఫలం కావాలని ట్రస్ట్ సభ్యులు కోరారు. సోమవారం ఉదయం చట్టి మీదుగా భద్రాచలం వైపు వెళ్లారు. ఈ యాత్ర రెండు నెలలు సాగుతుందని డా. సాహెబ్ రావు తెలిపారు. డా. సాహెబ్ రావు (65), శివ నారాయణ్ మిశ్రా (కర్నల్) (63), ఉత్సాహ కులకర్ణి (62) (సుబేదార్) లు యాత్ర సాగిస్తున్నారు.

పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 91వ వార్డు 480 సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో భాగంగా పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఏపి.ఎం.ఎస్.ఎం.ఈ.డిసి

చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసి పార్టీ జెండాను ఎగురవేశారు. వివిధ పథకాల కింద లబ్ధిదారులకు మంజూరు చేసిన వివరాలకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు జి.అప్పలస్వామి నాయుడు, బలరాం వసుపురెడ్డి రమణ, భారతి, నీలాపు శ్రీనివాస్ రెడ్డి, దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, వూటపల్లి గోవింద్, రమణ, గొడ్డు నాగరాజు, భరణి, కృపామని, సత్య కళ, జ్యోతి, సీ.వో. ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

జేకేసీలో 257 వినతులు స్వీకరణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం (జెకెసి)లో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కారం కావాలని సంయుక్త కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ జిల్లా అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రజల నుండి అర్జీలను జెసి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 257 అర్జీలను స్వీకరించగా, వాటిలో 95 అర్జీలు రెవెన్యూ శాఖ, 25 అర్జీలు పోలీసు శాఖ,71అర్జీలు జి.వి.ఎం.సి, 66 అర్జీలు ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏసిపి బాపూజీ, జిల్లా రెవిన్యూ అధికారి కె. మోహన్ కుమార్, రెవిన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్, జివిఎంసి, ఇతర శాఖలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల కేంద్రమైన ఎస్.రాయవరంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వార్షికోత్సవంలో భాగంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో కోలాటం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బొలిశెట్టి గోవిందరావు శారదా కుమారి, జడ్పిటిసి కాకర దేవి, వైసిపి జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ భూపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో పూజలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: కార్తీక సోమవారం పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకటలాడాయి. మండలంలోని గోపాలపట్నం శివారు పెద్దిపాలెం గ్రామంలో శ్రీ కాశి అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి దేవాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయంలో ఘనంగా పూజ నిర్వహించారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించిన విశాఖ సీపీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యాటలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని విశాఖ నగర కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించి అందాలను తిలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కొత్తపల్లి జలపాతం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ధీరజ్, సీఐ రమేష్, ఎస్సై శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శివపార్వతుల కళ్యాణం

విశాలాంధ్ర - పెందుర్తి: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా పెందుర్తి శివాలయంలో మాజీ కార్పోరేటర్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు శరగడం చినఅప్పల నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణం వైభవంగా జరిపించారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని చిన అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో రెండు వేలకు పైగా భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

166 మంది యువ న్యాయవాదులకు లా నేస్తం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వైఎస్సార్ లా నేస్తం పథకంలో భాగంగా జిల్లా నుంచి 166 మంది యువ న్యాయవాదులు లబ్ధిపొందారు. నాలుగో ఏట రెండో విడత లా నేస్తం నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీట నొక్కి విడుదల చేశారు. ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున 166 మందికి రూ.49,80,000ను వారి ఖాతాల్లో జమ చేశారు. గత ఏడాది జూలై నుంచి ఈ ఏడాది జూన్ వరకు రెండు విడతల్లో రెండు దఫాలు 119 మంది లబ్ధి పొందగా నాలుగో ఏట రెండో విడతలో తాజాగా 166 మంది ఆర్థిక ప్రయోజనం పొందారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోమవారం నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా నాలుగో ఏట రెండో విడత నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లాలోని అర్హులైన యువ న్యాయవాదులకు రూ.49,80,000ల విలువ గల మెగా చెక్కును కలెక్టర్, సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ పూర్ణిమా దేవి, యుసీడీవో పాపినాయుడు, ఇతర అధికారుల చేతుల మీదుగా అందజేశారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున, సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ పూర్ణిమాదేవి, యూసీడీవో పాపినాయుడు ఇతర అధికారులు, పలువురు యువ న్యాయవాదులు బి.వి.ఎస్.ఎస్. లాస్య ప్రియ, పి. స్వర్ణ తమ ఆనందాన్ని మీడియాతో పంచుకున్నారు.

గ్రామ దేవతకు పూజలు చేసుకోనివ్వండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: గ్రామ దేవత నూకాలమ్మకు పూజలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని, మాకు సెంటిమెంట్ అయిన దేవత విగ్రహాన్ని తొలగించకుండా అక్కడే కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్పందన కార్యక్రమంలో గాజువాకలోని 70 వార్డులో విశ్వనాథం కాలనీవాసులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తరఫున సిహెచ్ చిట్టి రెడ్డి, పలువురు మహిళలు మీడియాతో మాట్లాడారు.

తమ కాలనీ వాసులకు సెంటిమెంట్ అయిన నూకాలమ్మను గ్రామదేవతగా పూజిస్తూ చిన్న గుడి ఏర్పాటు చేసి 2018లో దేవత విగ్రహాన్ని పెట్టుకున్నామని, కళ్యాణ మండపం ఆనుకొని కాలువ పక్కన ఎవరికి ఎటువంటి ఆటంకం లేకుండా పూజలు చేసుకుంటు న్నామ న్నారు. అయితే స్థానికంగా ఉంటున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి, బిజెపి నాయకుడు కృష్ణంరాజు తమకు ఇబ్బందులకు గురి చేస్తూ లోకాలమ్మ విగ్రహాన్ని తొలగించాలని పట్టుబడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శంకా శ్రీనివాసరావు, విజయ లక్ష్మి, అయినంపూడి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: సుప్రీం కోర్టు తీర్పు తక్షణమే అమలు చేసి సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ రంగం కార్మికులు ప్రయోజన కోసం ఖర్చు పెట్టాలని ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో సత్యనారాయణ పురం గ్రామంలో శ్రీ సత్యనారాయణ మూర్తి దేవస్థానం వద్ద మూలపేట తాపీ మేస్త్రి సంఘం ఆధ్వర్యంలో జరిగిన వనభోజనాలులో ఆయన మాట్లాడారు. తండ్రిని మించిన తనయుడుగా ఉంటానని చెప్పిన జగన్ తండ్రి పెట్టిన సంక్షేమ బోర్డు పథకానికి తూట్లు పొడిచి రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికుల కడుపులు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల నుంచి సంక్షేమ బోర్డులో సభ్యత్వం పేరుతో, భవన నిర్మాణ యజమానుల నుంచి సెస్ పేరుతో వసూలు చేయడం తగదన్నారు.

ప్రభుత్వం దారి మళ్లించిన రూ. 1,200 కోట్ల సంక్షేమ బోర్డు నిధులను వెంటనే బోర్డుకు జమ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చిన్ని చిన్న, ఉపాధ్యక్షులు వల్ల నర్సింగరావు, నాయకులు కె.రమణ, ఉప్పిలి సత్తిబాబు, సిహెచ్.అప్పలరాజు, సత్తిబాబు, రామునాయుడు, ఆదినారాయణ పాల్గొన్నారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పరవాడ: ఫార్మా రసాయన వ్యర్థ జలాలను బయటకు విడిచి పరవాడ పెద్ద చెరువులోని చేపల మృతికి కారణమైన రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ, చెరువు ఆయకట్టు దారుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆయకట్టు దారుల సంఘం ప్రతినిధులు రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్పందన కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ స్మరణరాజ్‌కు వినతి పత్రం అందజేశారు.

రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే చెరువులోని టన్నులకొద్ది చేపలు మృత్యువాత పడ్డాయని వివరించారు. నష్టపోయిన రైతులకు తగు న్యాయం జరిగేలా చూడాలని వినతి పత్రం ద్వారా కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బిసి సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులుగా కర్రి

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్రంలో "కాపు"లకు తీవ్ర అన్యాయం ఇప్పటికీ జరుగుతూ వస్తుందని బీసీలంతా ఒకే తాటిపై నడవాలని, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కనీసం 25 మందిని శాసనసభ్యులుగా గెలిపించుకొని అసెంబ్లీలో" కాపు "వారి స్వరం వినిపించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకర్రావు తెలిపారు. ఆనందపురం మండలంలో సోమవారం గంభీరం చందన ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర నూతన అధ్యక్షులు కర్రీ ధనుంజయ నాయుడుకు నియామక పత్రాన్ని అధ్యక్షులు శంకర్రావు అందించారు. భారతదేశ చరిత్రలో కులగణన చేయుట మునుపెన్నడు జరగలేదని, పార్టీలకు అతీతంగా పెద్దల సహకారంతో సలహాలు సూచనలు పాటిస్తూ పార్టీని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి పల్లి శ్రీనివాస్ నాయుడు, నగర అధ్యక్షులు వల్లా రమణ, ఎంపీటీసీ దొంతల కనకరాజు పాల్గొన్నారు.

మానవ హక్కుల అవగాహన సదస్సు



విశాలాంధ్ర - అరకులోయ: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ వేడుకలు, మానవ హక్కుల అవగాహన సదస్సును ఘనంగా కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మానవ హక్కుల యొక్క అవసరాన్ని, అవగాహన యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పట్టాసీ చలపతి రావు, డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ లెక్చరర్ కె.స్వర్ణలత మహిళ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎ మురళి, డాక్టర్ బలరాం, సుభన్, దివ్య మౌనిక, లక్ష్మి, లాలికుమరి, అన్నపూర్ణ, సంధ్య, గోపాలకృష్ణ, సుందర్ రావు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ టీడీపీ శ్రేణుల సంబరాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: యువగళం పాద యాత్ర 3000 కిలో మీటర్లు చేరుకున్న సందర్భములో పెద గంట్యాడ తెలుగుదేశం శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి, తెలుగుదేశం పార్టీ నాయకులు 75వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్ గోక్యాడ ముత్యాలు, శ్రీమునిరి శ్రీనివాస రావు,ములకలపల్లి పెంటయ్య గంట్యాడ పోలయ్య బస అప్పల రెడ్డి దొమ్మేటి అప్పారావు, దొమ్మేటి నాగరాజు, పులి శ్రీరామ రెడ్డి, పులి పెరుమాళ్, నామాల శ్రీకాంత్, మొల్లి అప్పల నాయుడు, కాకినాడ అప్పల రాజు, మొల్లి రమణ, అండి బోయిన రాము నాయుడు, ఉరుకుటి అప్పారావు, పులి సురేశ్ రెడ్డి (బాబీ), నంబారు సింహాద్రి, మొల్లి రమణ బాబు, మొల్లి అప్పారావు, మొల్లి సోము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పంబా స్నానం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలం కేంద్రం ఎస్.రాయవరంలో అయ్యప్ప స్వామి పంబాస్నానం వైభవంగా జరిగింది. సోమవారం నూకంబిక ఆలయం నుండి అయ్యప్ప మాలధార భక్తులు పేడతుల్లు ఆడుతూ భోజనం చేశారు. అనంతరం అయ్యప్ప స్వామి విగ్రహానికి సమీపంలో ఉన్న వరాహ నదిలో పంబా స్నానం చేయించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు రంగ స్వామి, వరహాల స్వామి, నిర్వాహకులు దుబాసి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వెంపాడ శ్రీనివాసరెడ్డికి అవార్డు

విశాలాంధ్ర - భీమిలి: ఒడిస్సా భువనేశ్వర్ జయ దేవ్ భవన్‌లో నేషనల్ అకాడమి ఆఫ్ సాక్సార్తా మిషన్ వారి ఆధ్వర్యంలో వరల్డ్ వైడ్ అవార్డ్ 2023లో భాగంగా తగరపువలస ఏరియా వాస్తవ్యులు వెంపాడ వెల్ఫేర్ సొసైటి అధ్యక్షులు నిత్య సేవకులు వెంపాడ శ్రీనివాసరెడ్డి నిత్యం చేస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా 2023 బెస్ట్ షోసల్ యాక్టివిస్ట్ అవార్డును భువనేశ్వర్ మేయర్ సులోచన దాస్ చేతులు మీదుగా అందజేశారు.

స్వయంభూ గణనాథుని సన్నిధికేగిన పరమశివుడు

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలోని స్వయంభూ దేవాలయాలు అన్నింటిలో చరిత్ర ప్రసిద్ధి పొందిన చోడవరం స్వయంభూ గణపతి సన్నిధికి గంగ గౌరీ సమేత పరమేశ్వరుడు సోమవారం సపరివార సమేతంగా విచ్చేశారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం వరకు భక్తులచే విశేష పూజలందుకున్న చోడవరం పురాణ గంగ సమేత గౌరీ పరమేశ్వరులు భక్తులందరూ వెంట రాగా గణపతిని దర్శించుకున్నారు. పరమ శివుని రథా యాత్రను మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్. ఎస్.రాజు, స్టేషన్ సి.ఐ. బి.శ్రీనివాసరావులు ప్రారంభించారు. ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు ప్రత్యేక పూజలు జరుపగా, పట్టణ మహిళలు హారతులు ఇచ్చి సాగనంపారు.

ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలంలో మిచౌంగ్ తుఫాను కారణంగా సుమారు 500 హెక్టర్లు వరిపొలాలు నీట మునిగిపోయాయని ఎకరాకు 30 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని బీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడిగర్ల రాంబాబు అన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేసి పై అధికారులకు నివేదిక పంపించాలని వ్యవసాయ అధికారి చిరంజీవికి ఫిర్యాదు చేసారు. అలాగే నష్టపోయిన రైతులకు ఎకరాకు 30 వేల రూ. నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో బిజెవైఎమ్ మండల ప్రెసిడెంట్ గోవిందు, ఓబీసీ అధ్య క్షుడు ఆంజనేయులు, బిజెపి నాయకులు ఎం.నాయుడు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర - మాకవరపాలెం: ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు మాకవరపాలెం పోలీస్ స్టేషన్ రైటర్ ఆధ్వర్యంలో సబ్ డివిజనల్ క్రైమ్ స్పాట్ సిబ్బంది ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్త్రీలపై జరిగే నేరాలు గురించి సంబంధిత సెక్షన్ పైన, దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు, క్రైమ్ స్పాట్ ఇన్చార్జి కే.శ్రీనివాసరావు, సిబ్బంది భరతుడు శ్రీను, ప్రిన్సిపల్ కే.సుందరరావు, స్టాఫ్ పాల్గొన్నారు.

పార్టీ సీజన్ కోసం 'ప్లాటినమ్ ఎవారా'



విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఇయర్ ఎండింగ్ రాబోవు నూతన సంవత్సరం పురస్కరించుకొని 'ప్లాటినం ఎవారా' అధునాతన కలెక్షన్ అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ప్లాటినం ఎవారా కొత్త సేకరణలో ఆకర్షణీయమైన నెక్లెస్లు, ఆకట్టుకునే మణికట్టు నుంచి క్లిష్టమైన చెవిపోగులు, సొగసైన రింగ్ల వరకు అనేక రకాల డిజైన్లు ఉన్నాయన్నారు. ప్లాటినం ఎవరా స్టైలింగ్ ప్లాటినం చెవిపోగులు మెరిసే వజ్రాలు పొదిగిన డాంగ్లింగ్ ప్లాటినం బార్లు, సున్నితమైన డ్యూయల్ టోన్డ్ స్పోక్స్ లను కలిగి ఉన్న పూల మోటిఫ్ చెవిపోగులు కలవు. సంక్షిప్తంగా డిజైన్ చేసిన స్టడ్లు ఉన్నాయన్నారు.

పశు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



విశాలాంధ్ర - చీడికాడ: మిచౌంగ్ తుఫాన్ కారణంగా వచ్చిన వర్షాలు వల్ల పశువులకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చీడికాడ పశు వైద్యధికారిణి జి.గాయత్రీదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఖండివరం, చీడికాడ, పెదగొగడ, బైలుపూడి, దండిసురవరం, జైతవరం, శిరిజం గ్రామాలలో 400 పశువులకు హెచ్ఎస్ 200 పశువులకు బి క్యూ టీకాలు వేయడం జరిగిందన్నారు.

విద్యార్థికి 'చారిటీ బాక్స్' సాయం



విశాలాంధ్ర- విశాఖ సిటీ: పోర్ట్ రోడ్డులో సైకిల్‌పై టీ అమ్ముతూ జీవనం సాగిస్తున్న వెంకటరావును ఇటీవల లారీ ఢీకొనడంతో మృతి చెందిన విషయం విదితమే. దీంతో ఆయన కుమారుడు మణికీర్తన్ చదువుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆ కుటుంబం చారిటీ బాక్సును ఆశ్రయించింది. మణికీర్తన్ నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ (బీఎస్సీ కంప్యూటర్స్) రెండో సంవత్సరం చదువుతున్నారు. చదువుకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో 'చారిటీ బాక్స్' ఆయన చదువు బాధ్యతను తీసుకుంది. రెండో సంవత్సరం ఫీజు 36 వేలు చారిటీ బాక్సు సభ్యులు కళాశాల సిబ్బందికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా చారిటీ బాక్సు ప్రతినిధులు దౌలూరు శంకరరావు, తాడికొండ కరుణాకర్ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల నుంచి చారిటీ బాక్సు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పురిటి శ్రీనివాసరావు, లక్కోజు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

పంట నష్టపరిహారానికి ఎగనామం పెట్టేందుకే "జీఓ నెం.5"

విశాలాంధ్ర - చింతపల్లి: మిచౌంగ్ తుఫాను కారణంగా నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఎగనామం పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 5 ను జారీ చేయడం దురదృష్టకరమని సిపిఎం పార్టీ చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ ఆరోపించారు. సోమవారం చింతపల్లిలో జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి జీవో నెంబర్ 5 ప్రభుత్వం జారీ చేయడం భూటకంగా ఉందని ఆయన అన్నారు. జీఓ నెంబర్ 5 ప్రకారం 33% శాతం పంట నష్టం జరిగిన వారికే పరిహారం వర్తిస్తుందని చెప్పడం ఏమాత్రం సబబు కాదన్నారు. తుఫానుకు ముందు పంట కోసి వర్షం వల్ల అది తడిసి, మొలకలు వచ్చినా పంట నష్టం వర్తించదని అనడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. జీవో ప్రకారమైతే భారీగా తడిచి మొలకలు వచ్చి పాడైపోయిన ధాన్యంతో ఉన్న రైతులకు మాత్రమే కనీసం వెయ్యి రూపాయలు కూడా నష్టపరిహారం దక్కేలా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 5 ద్వారా రాష్ట్రంలోని రైతులకు తినడానికి ఆకు వేసి అన్నం పెట్టకుండా, విస్తరినిండా వడ్డించేసాం అన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. తుఫాను హెచ్చరికలు జారీచేసినా పంట కోసిన వాటికి, తడిసిన వాటికి నష్టపరిహారం వర్తించదంటే పరిహారం ఇవ్వకుండా తప్పించుకునే దొరణే అని అన్నారు. పూర్తిగా పంట పండిన తర్వాత కోతలు కోసి కుప్పలు వేయకపోతే పొలంలోనే గింజలు రాలిపోయే పరిస్థితి ఉంటుందని, అలాంటప్పుడు కోతకు వచ్చిన పంటని రైతులు కోయకుండా ఎలా ఉంటారని ఆయన ప్రశ్నించారు. రైతులు పండించే పంటలపై ప్రభుత్వానికి అవగాహన లేనట్లు స్పష్టంగా అర్థం అవుతుందని, అందువల్ల నష్టపరిహారానికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో రైతులను మోసం చేసేలా ఉందని, అది ఏమాత్రం స్వాగతించదానికి ఆమోదయోగ్యంగా లేదని పేర్కొన్నారు. ఆ జీవోలో విధి విధానాలు సరికాదని, అందువల్ల తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. నష్టపోయిన ప్రజలను ఆదుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, కిల్లో సింహాచలం పాల్గొన్నారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సహాయంతో బాలుడి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కురపల్లి గ్రామం వద్ద గోస్తనీ నదిలో ఆదివారం సాయంత్రం మధురవాడ గాయత్రీ నగర్‌కు చెందిన పొన్నగంటి హరి(16) ప్రమాదవశాత్తు చెక్ దాం కింద నీరు ప్రవహిస్తున్న చోట నదిలో కాలుజారి పడిపోయి మృతి చెందగా ఆదివారం నుండి సోమవారం సాయంత్రం వరకు స్థానిక మత్స్యకారులు, ఈతగాళ్లసహాయంతో పోలీసు వారు, అధికారులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ మృతదేహం లభ్యం కాలేదు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం సాయంత్రం బాలుదు మృతదేహాన్ని గుర్తించడం జరిగింది. మృతదేహాన్ని బయటికి తీసి అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని చూసి బాలుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మిత్రులు తీవ్రమైన ఏడుపులతో నది పరివాహ ప్రాంతం విషాద ఛాయలు అలుముకున్నాయి.

రహదారి మూసివేతకు నిరసనగా జనసేన ఆందోళన

నాదెండ్ల సహా పలువురు నేతలు అరెస్టు...

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖలో ట్రైకూన్ జంక్షన్ మూసివేతపై నిరసనకు జనసేన నేతలు ఆందోళనకు పిలుపు ఇవ్వడంతో అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ను పోలీసులు అరెస్టు చేశారు. ట్రైకూన్ కూడలి నుంచి వీఐపీ రోడ్డు వైపు వెళ్లే మార్గాన్ని మూసివేయడంపై జనసేన ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు సోమవారం ఆందోళనకు దిగారు. దీనికి మద్దతుగా నోవాటెల్ హోటల్ వద్ద నాదెండ్ల ఆందోళనకు దిగారు. దీంతో ఆయన తోపాటు నేతలు పంచకర్ల రమేష్ బాబు, మూర్తి యాదవ్, కోనా తాతారావు, శివశంకర్, పసుపులేటి ఉష కిరణ్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ట్రైకూన్ జంక్షన్ వీఐపీ రోడ్డు వద్ద భారీగా పోలీసులు మోహరించారు. సిరిపురంలో పీక్స్ అనే ప్రాజెక్టును ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నిర్మాణం చేపడుతున్నారు. దీనికి సంబంధించిన రోడ్డు డివైడర్‌ను మూసివేశారు. వాహనరాకపోకలు నిలిపివేశారు. ఈ అంశంపై ప్రజలు పడుతున్న ఇబ్బందులపై గత కొంతకాలంగా నగరంలో ఆందోళనలు జరుగుతున్నాయి. అంతకుముందు నోవాటెల్ హోటల్ వద్ద నాదెండ్ల మీడియాతో మాట్లాడారు.

శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలు మానుకోవాలని వైకాపా ప్రభుత్వానికి సూచించారు. వీఐపీ రోడ్డు వైపు వెళ్లే మార్గాన్ని మూసివేయడం వల్ల ప్రయాణికులు సుమారు 2 కి.మీ మేర అదనపు దూరం వెళ్లాల్సి వస్తుంది. విశాఖ ఎంపీ నిర్మిస్తున్న బిల్డింగ్ సేల్స్ పెంచుకోవడం కోసం ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్నారు. వాస్తు దోషం తొలగించుకోవడానికి రోడ్లు మూసివేయడం అన్యాయం. పోలీసు ఉన్నతాధికారులు ఆలోచన చేయాలి. డివైడర్ తొలిగించే వరకు జనసేన పోరాడుతుందన్నారు. ఈ ప్రభుత్వానికి ఇంకా మూడు నెలల మాత్రమే గడువు మిగిలి ఉంది అని నాదెండ్ల వ్యాఖ్యానించారు. గత మూడు నెలలుగా ట్రైకూన్ జంక్షన్లో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారని, ఎంపీ తనకు అనుకూలంగా జంక్షన్ మధ్యలో బార్కెట్లు వేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఇది వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకోవడం కాదా? అని నిలదీశారు. ఎంపీ సత్యనారాయణ లేఖ రాసినా పోలీసులు ఎందుకు బార్కెట్లు తొలగించడం లేదన్నారు. ఇది కేవలం ప్రజలను మభ్యపెట్టడానికేనని, ట్రాఫిక్ ఇబ్బందులు ప్రజలు స్వయంగా అనుభవిస్తున్నారన్నారు. ఈ విషయమై పలు మార్లు కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చామని, అయినా పట్టనట్లు వున్నారని నాదేండ్ల మనోహర్ అన్నారు. పోలీసులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన తెలుపుదామని పిలిపిస్తే తమను హోటల్ నుంచి బయటకు వెళ్ళనివ్వకపోవడం ఏంటన్నారు. జీవీఎంసీ కౌన్సిల్ మీటింగ్‌కు తమ కార్పొరేటర్లు హాజరుకావాల్సి వుందని, వారిని కూడా అరెస్ట్ చేయడం బాధాకరమన్నారు. మరో మూడు నెలలే ఉందని, ఈ ప్రభుత్వానికి పరాభవం తప్పదని నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.

విడుదల చేయకపోతే విశాఖలో తానే ఉద్యమిస్తా.. పవన్ కళ్యాణ్..

విశాఖలో జనసేన నేతల అరెస్టులపై ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడిన జనసేన నేతలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తో పాటు ఇతర నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసుల తీరును ఖండిస్తున్నామన్నారు. జనసేన నేతలను విడుదల చెయ్యకపోతే తానే విశాఖ వచ్చి ప్రజా సమస్యలపై పోరాడతానని స్పష్టం చేశారు.

ప్రషర్ బాంబు పేలి ఐదుగురు జవాన్లకు, పోలీసులకు గాయాలు

విశాలాంధ్ర - చింతూరు (అల్లూరి జిల్లా): మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాలు సందర్భంగా మావోయిస్టులు తమ ఉనికిని చాటుకున్న ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే చత్తీస్‌గడ్ రాష్ట్రంలో ప్రెస్సర్ బాంబులు వరుసగా పేలి సోమవారం ముగ్గురు సిఆర్పి జవాన్లకు, ఇద్దరు డి ఆర్ జి పోలీసులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే చత్తీస్గడ్ రాష్ట్రంలోని కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సలార్ద్ సంగ్ గ్రామంలో సిఆర్పిఎఫ్ క్యాంపు సర్వేకి 217 బెటాలియన్ కు చెందిన జవాన్లు,డి అర్ జి పోలీస్ లు ఆ గ్రామానికి తరలి వెళ్లారు. పోలీసులు నే టార్గెట్ చేస్తూ ముందుగానే అమర్చిన ప్రషర్ బాంబులు పేలడం తో తేతన్ లక్ష్మణ్ (డి ఆర్ జి) కే బీమా (డి ఆర్ జి) 217 బెటాలియన్ కు చెందిన మేజర్ మంటూ కుమార్ (55) హెడ్ కానిస్టేబుల్ అర్. ఒ. అరుణ్, కానిస్టేబుల్ యం. కార్తీక్ అనే జవాన్లకు గాయాలయ్యాయి. వీరిని గొల్లపల్లి కిష్టరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సలు నిర్వహించి అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన అనంతరం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి వాహన తనిఖీలు ముమ్మరం చేశారు.

క్రాంతినగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 63వ వార్డ్ క్రాంతి నగర్ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే అన్న కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన వైయస్ఆర్టియుసి మూడు జిల్లాల ప్రెసిడెంట్లీ కలిదిండి బద్రీనాథ్, నాలుగు వార్డుల (40,61,62,63,) జెసిఎస్ మండల కన్వీనర్ భోగవిల్లి నాగభూషణం, వార్డ్ అధ్యక్షుడు సోమదల సురేష్, వార్డ్ ఇన్‌చార్జి పిలక రామ్మోహన్ రెడ్డి, ఎస్సీ సెల్ మోనిటరింగ్ మెంబర్ పూడి మల్లేష్, సీనియర్ నాయకులు రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తండ్రి హత్యా కేసులో నిందితుడికి జీవిత ఖైదు

విశాలాంధ్ర బ్యూరోబి అనకాపల్లి (నాతవరం): తండ్రిని హతమార్చిన కేసులో నిందితుడైన కొడుక్కి జీవిత ఖైదు విధిస్తూ విశాఖపట్నం, 2వ ఏ.డీ.జె కోర్టు తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ కే.వీ. మురలీకృష్ణ తెలిపారు. జీవిత ఖైదు తో పాటు రూ.5,000/- జరిమానా జరిమానా కట్టని పక్షంలో 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించారని తెలిపారు.జిల్లాలోని నాతవరం పోలీసు స్టేషన్ లో 2022 ఫిబ్రవరి 10న న నమోదైన కేసులోమాధవనగరంకు చెందిన నిందితుడైన గంద్రకోట సత్తిబాబు తండ్రి లేటు గంద్రకోట అప్పన్న తండ్రిని హత్యా చేసిన కేసులో నిందితుడు మద్యం కు బానిసై తరచూ తండ్రిని డబ్బులు ఇవ్వమని గొడవలు పడేవాడని ఈ నేపథ్యంలో 2022 ఫిబ్రవరి 10న మద్యం తాగడానికిడబ్బులు ఇవ్వనగా తండ్రి ఇవ్వనగా వివాదం జరిగి కోపోద్రిక్తుడై పక్కనే ఉన్న కర్రతో తలపై కొట్టగా అక్కడికక్కడే గంద్రకోట అప్పన్న మరణించాడు. ఈ కేసులో అప్పటి నర్సీపట్నం రూరల్ సర్కిల్ సిఐ కె.శ్రీనివాసరావు దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారన్నారు.

తదుపరి విచారణ పూర్తి అయిన తరువాత 2వ ఏ.డీ.జె కోర్టు, విశాఖపట్నం న్యాయమూర్తి ఎం.వెంకటరమణ ముద్దాయి అయిన గంద్రకోట సత్తిబాబుకు జీవిత ఖైదు రూ.5,000/- జరిమానా విధించగా, జరిమానా కట్టని పక్షంలో 3 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ కె.వి.మురలీకృష్ణ తెలిపారు.

అల్లూరి, మల్లు దొర విగ్రహాల ప్రతిష్టకు భూమి పూజ

విశాలాంధ్ర - కొయ్యూరు: జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం కొయ్యూరు మండలం కాకరపాడు సెంటర్లో గతంలో నిర్వహించబడిన యూకో బ్యాంకు స్థలంలో కేటాయించిన 3 సెంట్లు స్థలంలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గాం గంటం దొరల విగ్రహాలను ప్రతిష్టించడానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణాల్లో భాగంగా జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం గతంలో ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహాన్ని అక్కడ నుండి తొలగించి సంఘానికి కేటాయింపబడిన స్థలంలో అల్లూరి విగ్రహంతో పాటు గిరిజన యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశంలో తొలిసారిగా జరిగిన 1952లో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైన గాం మల్లు దొర నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్టించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జాతి అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శి శ్యామల వరలక్ష్మి కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యవర్గ సభ్యులు కోనా సత్యనారాయణ, మాకాడ బూరుగులయ్య, కాంట్రాక్టర్ కోనా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాల ఘనత సీఎందే

విశాలాంధ్ర - గంగవరం: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(బాబు), రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జరిగిన పట్టాలు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. మండలంలో 57 మంది భూమిలేని నిరుపేద గిరిజనులకు పట్టాలు, గతంలో డీ నమూనా పట్టాలు పొందిన 137 మందికి లబ్దిదారులకు సంపూర్ణ హక్కు పత్రాలు (పట్టాలు), ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో మంజూరి అయిన ఉచిత గ్యాస్ కనెక్షన్లు, పొయ్యిలను 70మంది మహిళలకు పంపిణీ చేశారు.

బైక్ అదుపు తప్పి యువతి మృతి

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దారాలమ్మ ఘాట్ రోడ్డులో సోమవారం బైక్ అదుపు తప్ప లోయలో పడిన సంఘటనలో యువతి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గుమ్మిరేవులకు చెందిన ఆగురి మౌని(17) బూసిమానువీధికి చెందిన ముర్ల బుజ్జిబాబులు ద్విచక్ర వాహనంపై దారాలమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా దారకొండ ఘాట్ రోడ్డు రెండవ మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి 20 అడుగుల లోయలోకి పడిపోయింది. ఈ సమయంలో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న మౌని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న బుజ్జిబాబుకు తలకు తీవ్ర గాయాలతో ప్రాణాలతోబయటపడ్డాడు. మృతి చెందిన మౌని చింతపల్లిలో ఇంటర్ చదువుతుంది.

వినియోగదారుల హక్కులపై అవగాహన

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల -1లో వినియోగదారుల హక్కులు బాధ్యతలపై వినియోగదారుల రక్షణ చట్టం 2019పై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.లక్ష్మి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. అల్లూరి జిల్లా విజిలెన్స్ మెంబర్ సోనియా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి వినియోగదారుల వ్యవహారాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కొన్న ప్రతి వస్తువుకు విధిగా బిల్ తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ముంచంగిపుట్టు మండల వినియోగదారుల సంఘం అధ్యక్షులు ఎస్‌జీవి.ప్రసాద్, పెదబయలు వినియోగ సంఘం అధ్యక్షులు పాంగి శివకుమార్, కాంతారి మోహన్, బి.పూర్ణ, సొలగం గాసిరామ్ దొర, కె.మోహన్, రేయ్యాల భూషణ్ పాల్గొన్నారు.

గర్భిణీలకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా సోమవారం ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంప్‌నకు ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ ఎం.రత్నావలి హాజరయ్యారు. 39 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణీలకు అవసరమైన బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ గంగునాయుడు, షహనాజ్ సాదియా, సామాజిక ఆరోగ్య అధికారి సాంబమూర్తి, పి హెచ్ ఎన్ కృష్ణ వేణి, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై అక్రమాలకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: తన ఓటును తన తల్లిదండ్రుల ఓటును అక్రమంగా తొలగించిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ నగర అడిషనల్ పోలీస్ కమిషనర్ (ఏడిసిపి) ఎం.రామకృష్ణ రాజుకు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ సోమవారం మధ్యాహ్నం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలింగ్ బూత్ నంబర్ 273లో తమ ఓట్లను తొలగించారన్నారన్నారు. ఇదే విషయమై ఇప్పటికే నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కు కూడా ఫిర్యాదు చేసామని తెలిపారు. ఈ అక్రమానికి ప్రధాన కారణం వాలంటీర్ వ్యవస్థ అని ఆరోపించారు. 2019 సంవత్సరం నుంచి వాలంటీర్లు ప్రతి కుటుంబంపై నిఘా ఉంచి వారు ఏ పార్టీకి అనుకూలంగా ఉంటున్నారో తెలుసుకొని మరి అక్రమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 20న విజయనగరం జిల్లా పోలిపల్లిలో నిర్వహించే బహిరంగ సభకు సంబంధించి భూమి పూజ కార్యక్రమానికి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్రమంగా ఓట్ల తొలగింపు అంశాన్ని.. ఇదే క్రమంలో తాను చేస్తున్న పోరాటాన్ని కూడా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, కళా వెంకటరావుకు బి.వి.రామ్ వివరించారు.

చింతూరు బస్సు స్టాండ్ వద్ద గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు బస్సు స్టాండ్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా 4 కేజీ ల గంజాయిని పట్టుకుని ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి స్కూటీ ని స్వాధీనం చేసుకున్నారు చింతూరు పోలీసులు. ఒరిస్సా రాష్ట్రంలోని మల్కన్గిరి జిల్లా కిందుగుదా గ్రామంలోని కిలో రామచంద్రరావు వద్ద 4 కేజీ ల గంజాయి ని కొనుగోలు చేసి తెలంగాణ రాష్ట్రము వరంగల్ కు చెందిన వేల్పుల శ్యామ్,గణిపాక సాయికృష్ణ అనే ఇద్దరు ముద్దాయిలను పట్టుకున్నామని చింతూరు ఎస్సై డి శ్రీనివాస్ తెలిపారు. స్కూటీపై ఉన్న ఇద్దరు వ్యక్తులతో పాటుగా గంజాయి అమ్మిన వ్యక్తి, ముగ్గురు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నానని మీడియా కు వివరించారు.

దిబ్బపాలెంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండలంలోని దిబ్బపాలెం సచివాలయ పరిధిలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు నాయకులతో కలిసి పార్టీ జెండా ఎగురవేసి సంక్షేమ పథకాల గురించి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జడ్పీటీసి లాలం రాంబాబు, కో - జడ్పీటిసి నర్మాల కుమార్, అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు విమలనాయుడు, ఎంపీ టీసీలు లాలం శ్రీనువాసరావు, లాలం శ్రీను, నాయకులు అడిగర్ల దేముడు, గృహసారధులు తదితరులు పాల్గొన్నారు.

అడవి గేదె మృతి

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలంలో వేటగాళ్ల చెరలో మరో అడవిదే మృతి చెందింది. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల టేక్ ప్లాంటేషన్ సమీపాన కొంతమంది వేటగాళ్లు అమర్చిన కరెంటు ఉచ్చులో పడి భారీ గురగేదే మృతి చెందింది. మృతి చెందిన గురగేదెను వేటగాళ్లు గుట్ట చప్పుడు కాకుండా సగభాగం పైనే కోసి తరలించారు. ఈ క్రమంలోనే సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది వారిని శాఖంగా వ్యవహరించి అనుమానితులైన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు తరచు వేటగాళ్ల చెరలో అడవి గేదెలు మృతి చెందుతున్నా అటవీ శాఖ సిబ్బంది వాటిని కాపాడే ప్రయత్నంలో పూర్తిగా విఫలమవుతున్నారని బాహటంగానే జంతు ప్రేమికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ సంఘటనపై సోమవారం వివరణ కోరగా ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామని దీనిపై దర్యాప్తు చేపడుతున్నామని పూర్తి సమాచారం త్వరలో వెల్లడిస్తామని డివిజనల్ ఫారెస్ట్ అధికారి హాస్యాస్పదంగా సమాధానం ఇచ్చారు.

కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెబాట

విశాలాంధ్ర - కూనవరం: ఏపీ సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈనెల 20 నుంచి ఆయా విద్యా శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు నిరవధిక సమ్మె చేయనున్నట్లు నోటీసులో పొందుపరిచారు. కొన్ని శాఖలలో నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదని, పాత ఉద్యోగులకు జీతాలు పెంచలేదని, గత మూడేళ్లుగా ఎంటీఎస్ అమలు చేయడం లేదని, పిఆర్సి ఇవ్వడం లేదని, ప్రభుత్వం ఉద్దేశపూర్వకం గానే ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తుందని పలు డిమాం డ్లతో సమ్మెబాట పట్టనున్నట్లు తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో బి.సత్యవతి, కే వేణుగోపాల్ రెడ్డి, కే తులసి, ఎస్ వెంకటేష్, వి లక్ష్మణ్, సిహెచ్ జనార్దన్‌రావు, కే కావ్య, జి సుజాత తదితరులు ఉన్నారు.

సాగర్‌నగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్

విశాలాంధ్ర - సాగర్‌నగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమాన్ని మాజీ మంత్రి, భీమిలి నియోజక వర్గం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్‌రావు ఆదేశాలు మేరకు విశాఖపట్నం జీవీఎంసీ 8వ వార్డు పరిధి లో గల సాగర్ నగర్‌లో 87వ సచివాలయం వద్ద నిర్వహించారు. వార్డు అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి ఆధ్వర్యం లో వైసీపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైసీపీ సీనియర్ నాయకులు ఉప్పులూరి గోపి, గుంట బాలకృష్ణ, పవన్, రామ్మోహన్, చక్రపాణి పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర - జీకేవీధి: జీకేవీధి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో జీకేవీధిలో ర్యాలీ చేపట్టారు. పెట్రోల్ బంక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాన్ కారణంగా మండలంలోని రైతులు తీవ్రంగా పంట నష్టపోయారని, కావున మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలన్నారు. అలాగే వ్యవసాయ రుణాలు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, సిపిఐ, సిపిఎం, బిజెపి, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మల్కాపురం : 40వ వార్డు పరిధి షిపియార్డ్ కాలనీలో ఉన్న శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆఖరి సోమవారం 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 63వ వార్డు కార్పొరేటర్ బిగల్లా చిన్న పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస్ పంతులు ఇరువురిని సత్కరించారు.